'గుంటూరు కారం' చిత్ర యూనిట్ సందడి



సినిమాను వీక్షిస్తున్న మహేష్‌బాబు, త్రివిక్రమ్, పైడిపల్లి వంశీ

చిక్కడపల్లి: ప్రముఖ సినిమా హీరో మహేష్‌బాబు, శ్రీలీల హీరోయిన్‌గా త్రివిక్రమ్ దర్శకత్వంలో తెరకెక్కిన గుంటూరు కారం సినిమా శుక్రవారం విడుదల సందర్భంగా ఆర్టీసీ క్రాస్ రోడ్డులో ఉదయం నుంచే అభిమానుల సందడి నెలకొంది. ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సుదర్శన్ 35 ఎంఎం థియేటర్‌లో మహేష్‌బాబు కుటుంబ సభ్యులతో కలసి అభిమానుల మధ్య కూర్చొని మార్నింగ్‌షో సినిమాను వీక్షించారు. హీరోను చూసిన అభిమానులు ఆయనతో సెల్ఫీలు తీసుకునేందుకు పోటీపడ్డారు. ఆయన సతీమణి నమ్రత శిరోద్కర్, కూతురు సితార, కుమారుడు గౌతమ్, సినీ దర్శకుడు త్రివిక్రమ్, పైడిపల్లి వంశీ, నాగవంశీ, శిరీష్‌రెడ్డి తదితరులు సినిమాను వీక్షించారు. థియేటర్ యాజమాని టి.బాలగోవింద్, మేనేజర్లు శ్రీనివాస్‌రెడ్డి, కుమార్‌లు మహేష్‌బాబుకు, చిత్ర యూనిట్‌కు స్వాగం పలికారు.

సగరుల అభివృద్ధికి కృషి



బహుమతులను ప్రదానం చేస్తున్న విజయేంద్రసాగర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సగరుల అభివృద్ధికి తమవంతుగా కృషి చేస్తామని అఖిల భారత సగర మహాసభ అధ్యక్షులు విజయేంద్రసాగర్, ప్రధాన కార్యదర్శి హనుమాన్‌సాగర్, కోశాధికారి పార్థసారథి సాగర్ తెలిపారు. శుక్రవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకొని బాగ్‌లింగంపల్లిలో అఖిల భారత సగర మహాసభ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సందేశాత్మకమైన ముగ్గులను వేశారు. పోటీల్లో గెలుపొందిన మహిళలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు. సగర మహాసభ సలహాదారులు నిరంజన్, సంయుక్త కార్యదర్శి రాజేష్, శ్యామ్‌సాగర్, విజయ్‌కుమార్, బీజేపీ సీనియర్ నాయకులు నైషదం సత్యనారాయణమూర్తి, శ్రీనివాస్, సుధాకర్, విజయ్, మహిళా కన్వీనర్ మంజులాసాగర్, కోకన్వీనర్ శైలజ పాల్గొన్నారు.

ఘనంగా లిటిల్‌ఫ్లవర్ హై స్కూల్ వార్షికోత్సవం



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఉపేందర్, కృష్ణవేణి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అంబర్‌పేట నియోజకవర్గం గోల్నాక జైస్వాల్ గార్డెన్‌లోని లిటిల్ ఫ్లవర్ హై స్కూల్ 28వ వార్షికోత్సవం శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు గణపతి పాటలతో సంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంక్రాంతి పండగను నృత్యాలతో సభికులను అలరించారు. విద్యార్థులు చేసిన ఆధునిక, సాంస్కృతిక నృత్యాలు ఎంతగానో అలరించాయి. పాఠశాల కరస్పాండెంట్ ఉపేందర్, ప్రిన్సిపాల్ కృష్ణవేణి మాట్లాడుతూ... విద్యార్థులకు చదువుతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు కూడా ఎంతో ముఖ్యమని తెలిపారు. వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్, వాసుదేవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి యువతే బలం



మాట్లాడుతున్న డాక్టర్ హిప్నో పద్మాకమలాకర్

ముషీరాబాద్: సమాజానికి యువతే బలమని డాక్టర్ హిప్నో కమలాకర్స్ మైండ్ అండ్ పర్సనాలిటీ కేర్ డైరెక్టర్ డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ అన్నారు. శుక్రవారం జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా డాక్టర్ హిప్నో కమలాకర్స్ ఆధ్వర్యంలో ముషీరాబాద్ రెయిన్‌బో అనాథాశ్రమంలో స్వామి వివేకానందపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పద్మా కమలాకర్ మాట్లాడుతూ... యువత ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని సూచించారు. యువతీయువకులు ఎన్నో మానసిక సమస్యలు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారానికి యువత ఆత్మవిశ్వాసంతోనే ఉండాలన్నారు. అర్థంలేని అహంకారాలకు, పంతాలకు పోతే చివరికి నష్టపోయేది మనమేనని పేర్కొన్నారు. లయన్స్ క్లబ్ ప్రతినిధి కృష్ణవేణి, జ్యోతి, స్వరూపారాణి, శోభారాణి తదితరులు పాల్గొన్నారు. వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన బాలికలను ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.

సమస్యల పరిష్కారానికి నిరంతర కృషి



పవర్ బోర్‌ను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ రవిచారి

ముషీరాబాద్: ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యనూ సాధ్యమైనంత త్వరగా పరిష్కరించేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ కె.రవిచారి అన్నారు. కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ పార్లమెంట్ సభ్యుడు గంగాపురం కిషన్‌రెడ్డి సహకారంతో దాయర మార్కెట్‌లో పవర్ బోర్‌ను ఏర్పాటు చేశారు. శుక్రవారం కార్పొరేటర్ రవిచారి పవర్ బోర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల అవసరాలను గుర్తించి వారికి మెరుగైన సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. అనంతరం యువజన సంఘం తరపున కార్పొరేటర్ రవిచారికి కృతజ్ఞతలు తెలిపి ఘనంగా సన్మానించారు.

కస్టమ్స్ అధికారులమంటూ రూ. 2 లక్షల మోసం

హిమాయత్‌నగర్: కస్టమ్స్ అధికారులమని బెదిరించి ఓ వ్యక్తి నుంచి రూ. 2 లక్షలను సైబర్ నేరగాళ్లు కాజేశారు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి సమాచారం మేరకు... అశోక్ నగర్‌కి చెందిన ఓ వ్యక్తికి కస్టమ్స్ అధికారులమని చెప్పి ఫోన్ కాల్ వచ్చింది. తన మొబైల్ నంబర్ నుంచి అమ్మాయిలను వేధిస్తూ, బ్లాక్ మెయిల్ చేస్తున్నారంటూ, దీంతో పాటు మనీలాండరింగ్‌కు పాల్పడుతున్నారనే కేసులు నమోదయ్యాయని బెదిరించారు. తాము చెప్పినట్లు చేస్తే కేసులు లేకుండా చేస్తామని నమ్మించారు. తన పూర్తి బ్యాంక్ అకౌంట్ల వివరాలతో పాటు రూ. 2 లక్షలు పంపిస్తే వాటిని వెరిఫై చేసి తిరిగి పంపిస్తామని నమ్మించారు. వారు చెప్పిన విధంగా వివరాలతో పాటు నగదును ట్రాన్స్‌ఫర్ చేశాడు. డబ్బులు తిరిగి రాకపోవడంతో వారి ఫోన్ చేసిన నంబర్లు పనిచేయకపోవడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏసీపీ శివమారుతి తెలిపారు.



నివాళులర్పిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ తదితరులు



బర్కత్‌పురాలోని బీజేపీ నగర కార్యాలయంలో స్వామి వివేకానందునికి నివాళులర్పిస్తున్న ఆ పార్టీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు గౌతమ్‌రావు

స్ఫూర్తిప్రదాత స్వామి వివేకానంద

- వాడవాడలా వివేకానంద జయంతి
- ఘనంగా నివాళులర్పించిన వివిధ పార్టీల నేతలు

అంబర్‌పేట్: స్వామి వివేకానంద జయంతి ఘనంగా జరిగింది. శుక్రవారం అంబర్‌పేట్ నియోజకవర్గంలో ఆయా ప్రాంతాల్లో స్వామి వివేకానంద విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాగ్ అంబర్‌పేట్‌లోని రెడ్‌బిల్డింగ్ చౌరస్తాలో నిర్వహించిన వివేకానంద జయంతి కార్యక్రమానికి స్థానిక కార్పొరేటర్ బి.పద్మా వెంకట్ రెడ్డితో కలిసి హాజరై నివాళులు అర్పించారు. అలాగే బీజేపీ నగర కార్యాలయంలో వివేకానంద జయంతి కార్యక్రమం జరిగింది. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గౌతమ్‌రావు, మాజీ మంత్రి కృష్ణయాదవ్‌తో పాటు అంబర్‌పేట నియోజకవర్గం సీనియర్ నాయకులు పాల్గొన్నారు. అలాగే కాచిగూడ కార్పొరేటర్ కార్యాలయంలో కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్ యాదవ్, సీనియర్ నాయకులు రమేష్‌యాదవ్, ఇతర పార్టీ నాయకులు స్వామి వివేకానందునికి నివాళులు అర్పించారు. అలాగే గోల్నాక డీమార్ట్ చౌరస్తాలో ఉన్నా వివేకానందుని విగ్రహం వద్ద జయంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్ ఇతర బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

ముషీరాబాద్ నియోజకవర్గం పరిధిలో...

చిక్కడపల్లి: యువతకు స్ఫూర్తి ప్రదాత దేశ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన గొప్ప మహనీయుడు స్వామి వివేకానంద అని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ అన్నారు. గాంధీనగర్‌లో వివేక జ్యోతి సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే ముఠా గోపాల్ స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సేవా సమితి అధ్యక్షుడు దశరథ్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ముఠా జైసింహ, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు ఎం.రాకేశ్‌కుమార్, సాయి సెక్యూరిటీ అధినేత డి.స్వామి, బీజేపీ నాయకులు రత్నసాయి చంద్, నాయకులు పున్న సత్యనారాయణ, శ్రీనివాస్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుడి స్ఫూర్తితో ముందుకు సాగాలి: డాక్టర్ వివేక్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వివేకానందుడి స్ఫూర్తితో విద్యార్థులు ముందుకు సాగాలని అంబేడ్కర్ విద్యా సంస్థల చైర్మన్, ఎమ్మెల్యే డాక్టర్ జి.వివేక్‌వెంకటస్వామి, కరస్పాండెంట్ ఎమ్మెల్యే జి.వినోద్ తెలిపారు. బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా నేషనల్ యూత్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ కళాశాల నుంచి ట్యాంక్‌బండ్‌లోని అంబేడ్కర్ విగ్రహం మీదుగా లూంబినీ పార్కు, నెక్లెస్ రోడ్ మీదుగా 3కే రన్‌ను కొనసాగించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ శ్రీధర్, మహిళా ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ పి.మాధవి, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ముషీరాబాద్‌లో...

ముషీరాబాద్: యువతకు స్ఫూర్తి ప్రదాత స్వామి వివేకానంద అని ఆల్ ఇండియా కాంగ్రెస్ ఫిషర్‌మెన్ కమిటీ కార్యదర్శి బిజ్జి శత్రు అన్నారు. స్వామి వివేకానంద జయంతిని ముషీరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

పద్మ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో...

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: స్వామి వివేకానందుడు యువతకు స్ఫూర్తిప్రదాత అని మాతా వాకర్స్ క్లబ్ నల్లకుంట అధ్యక్షుడు డాక్టర్ వై.మురళీధరుడు అన్నారు. పద్మ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో వివేకానంద జయంతిని నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎలెక్టెడ్ లింగప్రకాష్, సలహాదారులు రామలింగేశ్వర్‌రావు, క్లబ్ కార్యదర్శి ఎ.శ్రీనివాస్, కోశాధికారి జైహింద్, శరత్‌కుమార్, సురేష్, లోకేష్, వినోద్, గాంధీ తదితరులు పాల్గొన్నారు.



రెడ్ బిల్డింగ్ చౌరస్తాలో కార్పొరేటర్ పద్మా వెంకట్‌రెడ్డి



అంబేద్కర్ కళాశాల వద్ద 3కే రన్‌ను నిర్వహిస్తున్న అంబేద్కర్ కళాశాల విద్యార్థులు



కాచిగూడలోని కార్పొరేటర్ కార్యాలయంలో...



ముషీరాబాద్‌లో నివాళులర్పిస్తున్న బిజ్జి శత్రు తదితరులు



గోల్నాకలో కార్పొరేటర్ దూసరి లావణ్య శ్రీనివాస్‌గౌడ్



పద్మ కాలనీలో మాతా వాకర్స్ క్లబ్ నేతలు

ఇందిరాపార్కు అభివృద్ధిలో రాజకీయాలకు తావులేదు

ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్



సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: ఇందిరాపార్కులో జరిగే అభివృద్ధి కార్యక్రమాల విషయంలో ఉద్యానవన శాఖ అధికారులు, వాకర్స్ సమన్వయంతో పనిచేసే ఇందిరా పార్కు అభివృద్ధి కోసం పాటుపడాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ సూచించారు. ఇటీవల ఇందిరాపార్కులో కొంతమంది వాకర్స్ అసోసియేషన్‌కు ఎన్నికలు నిర్వహించాలని ప్రస్తుత వాకర్స్ అసోసియేషన్ సభ్యులు, కొంతమంది వాకర్స్‌కు జరుగుతున్న గొడవ నేపథ్యంలో ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఇందిరాపార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ సుధాకర్ యాదవ్, అసోసియేషన్ సభ్యులు శ్రీనివాస్ ముదిరాజ్, ప్రభాకర్ యాదవ్, ఆర్.రాంచందర్, ఇందిరాపార్కు డిప్యూటీ డైరెక్టర్ రాజ్‌కుమార్ సిబ్బందితో ఎమ్మెల్యే ముఠాగోపాల్ సమావేశం నిర్వహించారు. పార్కులో ఉన్న ప్రశాంతవాతావరణాన్ని రాజకీయాల పేరుతో కలుషితం చేయవద్దని, ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే ఆయా శాఖల అధికారులతో చర్చించి సమస్యలు పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. వాకర్స్ అసోసియేసన్ అధ్యక్షుడు డాక్టర్ ఎ.సుధాకర్‌యాదవ్, శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ... ఇందిరాపార్కులో ఎన్నడూ లేని విధంగా కొంతమంది స్వార్థపరులు రాజకీయాలు చేస్తున్నారని, రాజకీయాలు చేసే డిడి రాజ్‌కుమార్ మద్దతు ఇస్తున్నారని ఇది తగదని, ఇందిరాపార్కు డెవలప్‌మెంట్ కమిటీ పేరుతో ఆ గ్రూప్ క్రియేట్ చేసి ఎంతో కాలంగా కలిసి ఉంటున్న వాకర్స్ మధ్య విభేదాలు సృష్టిస్తున్నారని ఆరోపించారు.

సన్మానం



మధుసూదన్‌ను సత్కరిస్తున్న ఉపాధ్యాయులు

అంబర్‌పేట్: తెలంగాణ రికగ్నైజ్‌డ్ స్కూల్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (ట్రాస్మా) రాష్ట్ర అధ్యక్షుడిగా ఎన్నికైన సాదూల మధుసూదన్‌కు సత్కరించారు. శుక్రవారం అంబర్‌పేట బాపూనగర్‌లోని ప్రగతి పాఠశాలలో ఆయా పాఠశాలల సిబ్బంది ట్రాస్మా ప్రతినిధులు ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా మధుసూదన్ మాట్లాడుతూ... ప్రభుత్వ గుర్తింపు పొందిన బడ్జెట్ పాఠశాలల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ట్రాస్మా మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, నిసా గ్రీన్ అంబాసిడర్ గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

డప్పు, చెప్పు వృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలి



పోరు గర్జన కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న నాయకులు

ముషీరాబాద్: డప్పు, చెప్పు వృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలని, బలహీనవర్గాలు పని చేసే పారిశుద్ధ్య విభాగ కార్మికులను క్రమబద్ధీకరించాలని ఎమ్మార్పీఎస్ కోర్ కమిటీ సభ్యులు బంగారు శ్రీనివాస్, ఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కొల్లూరి వెంకటేష్‌మాదిగ అన్నారు. డప్పు, చెప్పు వృత్తిదారులకు పింఛన్ ఇవ్వాలని, పారిశుద్ధ్య కార్మికులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం విద్యానగర్‌లోని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యలయంలోని సమావేశాన్ని నిర్వహించారు. ఫిబ్రవరి 29న పోరు గర్జన కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నిజాయితీతో పని చేస్తూ విలువలు పెంపొందించే విధంగా కృషి చేయాలని అన్నారు. సామాజిక న్యాయం జరగాలంటే ఉద్యమించాలన్నారు. పని చేసి బతుకుతూ సమాజంలో ఉత్తమ స్థాయికి చేరుకోవాలని, గతంలో డప్పు, చెప్పు కుల వృత్తులకు ఫించన్ ఇవ్వాలని డిమాండ్‌తో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో మూడు వేల కిలోమీటర్లు పాదయాత్ర చేశామని గుర్తు చేశారు. డప్పు, చెప్పు వృత్తి కులాల వారికి నెలకు ఐదు వేల రూపాయలు ఫించన్ అందించాలని కోరారు. న్యాయం కోసం కృషి చేస్తూ, పోరాటం కొనసాగిస్తామన్నారు. పోరాట చరిత్ర కలిగిన ఎమ్మార్పీఎస్ ఎన్నో ఉద్యమాలకు, సంఘాలకు పునాదిగా మారిందన్నారు. వర్గీకరణతోనే సామాజిక న్యాయం జరుగుతుందని, అన్ని కులాలకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. నేతలు పసలాది యాదగిరి, చాప కృష్ణ, ఆండాళు, నందకిషోర్, కాదాసి రాహుల్, కాసర్ల సురేష్, ఎల్లయ్య, మహేష్, సురేష్, సాయిలు, దయాకర్, నగేష్, పాండు, గణేష్, బాబురావు, చంద్రశేఖర్, విశాల్, రవీందర్, రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.


మందుల కుల సంఘం యువజన అధ్యక్షుడిగా కార్తీక్‌కుమార్



మాట్లాడుతున్న కార్తీక్‌కుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: తెలంగాణ రాష్ట్ర మందుల కుల సంఘం యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా వంటిద్దు కార్తీక్‌కుమార్ ఎన్నికయ్యారు. శుక్రవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మందుల కుల సంఘం యువజన సమ్మేళనం జరిగింది. కార్యక్రమంలో పాల్గొన్న సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింగజోని శ్రీనివాస్, వర్కింగ్ ప్రెసిడెంట్ ఓరుగంటి రమేష్, ప్రధాన కార్యదర్శి వివేకానంద సమక్షంలో కార్తీక్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం కార్తీక్‌కుమార్ మాట్లాడుతూ... మందుల కుల సంఘం అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానని అన్నారు. తనకు అవకాశం కల్పించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు తెలిపారు.

జూనియర్ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ కార్యవర్గం



బి.లక్ష్మయ్య, అధ్యక్షుడు

చిక్కడపల్లి: జూనియర్ కాలేజ్ ఫిజికల్ డైరెక్టర్స్ అసోసియేషన్ (టీజేసీపీడీఏ) నూతన అధ్యక్షుడిగా బి.లక్ష్మయ్య, ప్రధాన కార్యదర్శిగా ఎం.పర్వాతలుగౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఈ సందర్భంగా అధ్యక్షుడు బి.లక్ష్మయ్య మాట్లాడుతూ... ప్రస్తుతం పాలమూరు యూనివర్సిటీకి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ లక్ష్మీకాంత్ రాథోడ్ సమర్థవంతంగా బాధ్యతలు చేపట్టిన తరుణంలో ప్రభుత్వం జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్‌గా ఫిజికల్ డైరెక్టర్లకు అవకాశం ఇవ్వడానికి ప్రభుత్వానికి ఉన్న ఇబ్బంది ఏమిటి అని ఆయన ప్రశ్నించారు. హైస్కూల్‌లో పనిచేస్తున్న ఫిజికల్ డైరెక్టర్లకు ప్రమోషన్ ద్వారా జూనియర్ కాలేజీలో పీడీలకు అవకాశం కల్పించాలని ఆయన కోరారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సి.పార్థసారథి ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ కళాశాల వద్ద ముగ్గుల పోటీలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని తమ ప్రతిభచాటారు. బీజేపీ రాష్ట్ర నాయకులు నైషదం సత్యనారాయణమూర్తి, రాంనగర్ డివిజన్ అధ్యక్షుడు కలకోట అరుణ్, గోక మంగళ తదితరులు పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో గెలుపొందని మహిళలకు బహుమతులు ప్రదానం చేశారు.

వర్సిటీ భూములను వెనక్కి తీసుకోవాలి: పీడీఎస్‌యూ

ముషీరాబాద్: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయంకి చెందిన 100 ఎకరాల భూములను తెలంగాణ నూతన హైకోర్టు నిర్మాణానికి కేటాయించడం సరైంది కాదని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) డిమాండ్ చేసింది. శుక్రవారం పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు పి.మహేష్, ప్రధాన కార్యదర్శి ఎస్.వి.శ్రీకాంత్ మాట్లాడుతూ... ఆ భూములను కేటాయిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన జీవో 55ను వెంటనే రద్దు చేయాలన్నారు. తిరిగి భూములను వ్యవసాయ యూనివర్సిటీకి అప్పగించాలన్నారు అవసరమైతే విద్యార్థుల పరిశోధనలకు అనుగుణంగా మరిన్ని భూములను కేటాయించాలి కానీ ప్రభుత్వం ఉన్న భూమి లాక్కోవడాన్ని ఖండిస్తున్నామన్నారు. యూనివర్సిటీలో నాలుగు రోజులుగా విద్యార్థులు చేస్తున్న పోరాటానికి తమ సంపూర్ణ మద్దతు ఉంటుందన్నారు. యూనివర్సిటీ భూముల పరిరక్షణ కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని తెలిపారు.

ఆదర్శనీయుడు స్వామి వివేకానంద

ఆచార్య కొలకలూరి ఇనాక్



సన్మాన గ్రహీతలతో ఆచార్య కొలకలూరి ఇనాక్ తదితరులు

చిక్కడపల్లి: స్వామి వివేకానంద ఆదర్శనీయుడని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం పూర్వ ఉపకులపతి ఆచార్య కొలకలూరి ఇనాక్ అన్నారు. శుక్రవారం సాయంత్రం వేదహిత ఫౌండేషన్, పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్‌ల సంయుక్తాధ్వర్యంలో త్యాగరాయ గానసభలో స్వామి వివేకానంద జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద స్ఫూర్తి అవార్డుల ప్రదానోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ... స్వామి వివేకానంద యువతకు మార్గదర్శకుడు, స్ఫూర్తి ప్రదాత అని కొనియాడారు. ఈ సందర్భంగా స్వామి వివేకానందుని జీవిత చరిత్రపై నిర్వహించిన కవి సమ్మేళనంలో కవులు, కవయిత్రులు పాల్గొని స్వీయకవితలను చదివారు. రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఉప్పల శ్రీనివాస్‌గుప్తా, కె.నరసింహరాజు, అజయ్ రాజ్, చెన్నయ్య, అరుణజ్యోతి, చక్రధర్, లింగారెడ్డి, సుంకర మౌనిక, మురళీమోహన్‌రాజు, ఎస్.రామచంద్రరావు, రాధాకుసుమ తదితరులు పాల్గొన్నారు.

బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషి చేయాలి



నిర్వహిస్తున్న హ్యూమన్ రైట్స్ క్లబ్ నాయకులు

ముషీరాబాద్: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని పలువురు వక్తలు సూచించారు. శుక్రవారం ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాలలో జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా పీపుల్స్ యాక్షన్ ఫర్ రూరల్ (పారా), హ్యూమన్ రైట్స్ క్లబ్‌ల సంయుక్త ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కల్పిస్తూ ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల నుంచి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూసీ మెంబర్ లలిత, డీసీపీవో శ్రీనివాస్‌రెడ్డి, ముషీరాబాద్ తహసీల్దార్ జూనియర్ అసిస్టెంట్ రమేష్, జాతీయ యువజన అవార్డు గ్రహీత మహేష్, ముషీరాబాద్ ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయులు నరేందర్‌యాదవ్ మాట్లాడుతూ... బాల్య వివాహాలు, విద్యను మధ్యలో ఆపేసిన పిల్లలను గుర్తించి వారికి కావాల్సిన అవసరాలను తీర్చి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దేందుకు కృషి చేయాలన్నారు. పేదింటి పిల్లలు విద్యను మధ్యలో ఆపేయకుండా వారిని ప్రోత్సహించాలని సూచించారు. పారా సంస్థ కోఆర్డినేటర్ అంబేడ్కర్, రాష్ట్ర కో ఆర్డినేటర్ నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మూలగౌరీ నోము సామగ్రి పంపిణీ



మూలగౌరీ వ్రతం నోము సామగ్రిని పంపిణీ చేస్తున్న దృశ్యం

ముషీరాబాద్: సంక్రాంతి పండగను పురస్కరించుకొని శ్రీ వాసవి స్వర్ణనిధి రాంనగర్ శాఖ ఆధ్వర్యంలో ఆ సంస్థ సభ్యులకు ఉచితంగా మూల గౌరీ నోములకు సంబంధించిన సామగ్రి, గిఫ్టులను శుక్రవారం పంపిణీ చేశారు. వీటిని ఆ సంస్థ ప్రతినిధులు వి.అరుణ కుమారి, అపర్ణ, మమత, స్వర్ణరాణి, దుర్గలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా చైర్మన్ చందాప్రకాష్‌గుప్తా, తెలంగాణ ఆర్యవైశ్య మహాసభ కోశాధికారి కొండ్లె మల్లికార్జున్, రాంనగర్ ఆర్యవైశ్య సంస్థ అధ్యక్షుడు వి.సుధాకర్‌గుప్తా, మాజీ అధ్యక్షులు కాసనగొట్టు రాజశేఖర్‌గుప్తా, నూకల రామనాథంగుప్తాతో పాటు పలువురు మాజీ చైర్మన్లు పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

చిక్కడపల్లి: చిక్కడపల్లి గంగపుత్ర సంఘం అధ్యక్షుడు గుండు జగదీశ్‌బాబు ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర కేలండర్‌ను గాంధీనగర్‌లోని సంఘం కార్యాలయంలో సలహాదారులు గుండు జయేంద్రబాబు, బంగారు సంపత్, పాక జ్ఞానేశ్వరిదేవి శుక్రవారం ఆవిష్కరించారు. అనంతరం సంక్రాంతి ముగ్గుల పోటీలను నిర్వహించారు. గెలుపొందిన మహిళలకు చీరలను అందజేశారు. కార్యక్రమంలో నేతలు ముదారి వినోద్, నరాల వెంకటేష్, పారిపల్లి యాదగిరి, పి.రాజ్‌కుమార్, శంకర్, రాజు, బి.సుజాత, ధనలక్ష్మి, సుమలత, భారతి తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంట్ ఎన్నికల్లో మాదిగలకు

రెండు జనరల్ స్థానాలు ఇవ్వాలి

డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్

పంజగుట్ట: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలోని ఎస్సీలకు 2 రిజర్వ్‌డ్ స్థానాలతోపాటు మాదిగలకు రెండు జనరల్ సీట్లల్లో పోటీ చేయడానికి అవకాశం కల్పించాలని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. 2009, 2014లలో దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్‌రెడ్డి రిజర్వ్‌డ్ రెండు స్థానాలతోపాటు ఒక జనరల్ స్థానం కేటాయించారని గుర్తుచేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ రాజకీయ వేదిక చైర్మన్ వక్కలగడ్డ చంద్రశేఖర్, వివిధ మాదిగ సంఘాల నాయకులతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. ఎస్సీ జనాభా ప్రకారం మూడు రిజర్వ్‌డ్, రెండు జనరల్ స్థానాల్లో అవకాశం కల్పించాలన్నారు. ఎస్సీల్లో 59 కులాలుండగా మాల, మాదిగలను మినహాయిస్తే మిగిలిన కులాలకు 5 వేల ఓట్లు కూడాలేవని, కానీ వారే అసలైన మాదిగ, మాలలుగా చలాయిస్తూ అవకాశాలు అనుభవిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ సమస్యలు వివరించేందుకు ఈ నెల 22న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇస్తామని, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో ఢిల్లీకి వెళ్లి సోనియాగాంధీ, మల్లికార్జున ఖర్గేను కలిసి వినతిపత్రాలు ఇస్తామన్నారు.